క్లుప్తంగా

అశోకుని శిలాశాసనాలను సందర్శించిన తహసీల్దార్


శిలాశాసనాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ షర్మీల

తుగ్గలి : మండల పరిధిలోని జొన్నగిరి సమీపంలో ఉన్న అశోకుని శిలాశాసనాలను మంగళవారం తహసీల్దార్ షర్మీల సందర్శించారు. మౌర్య వంశానికి చెందిన అశోకచక్రవర్తి పెద్ద బండరాళ్లపై ప్రాకృత(పాలీ) భాషలో సింధు లిపి పోలిన(సర్పలేఖన పద్ధతి) చెక్కించిన శాసనాలను పరిశీలించారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ సుధాకరరెడ్డి, వీఆర్వో అనంతస్వరూప్, శాసనాల పర్యవేక్షక సిబ్బంది ఉన్నారు.

కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించండి


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మద్దికెర : ఇంటింటికీ వెళ్లి కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించాలని ప్రభుత్వ వైద్యాధికారి రాగిణి సూచించారు. ఈనెల 18 నుంచి ఆగష్టు 2 వతేదీ వరకు కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం చేపట్టనున్న నేపథ్యంలో మంగళవారం మండల కేంద్రం మద్దికెరలో ఆశా, ఆరోగ్య కార్యకర్తలకు ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యసిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి శరీరంపై స్పర్శలేని మచ్చలున్నచో కుష్ఠు వ్యాధిగా అనుమానించి వారిని వెంటనే ఆరోగ్య కేంద్రాలకు పంపాలని సూచించారు. కుష్ఠు లక్షణాలు ప్రజలకు వివరించి చైతన్న పరచాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో పూర్తిగా ఉచితంగా మందులు, నిర్ధారణ పరీక్షలు చేస్తామని విషయాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా, సిబ్బంది కృష్ణమ్మ, సూర్యనారాయణ, లక్ష్మి, అంజలి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సామాజిక తనిఖీ


మాట్లాడుతున్న ఏపీడీ పక్కీరప్ప

దేవనకొండ: 2023-24 ఆర్థిక సంవత్సరంలో మండలంలో జరిగిన ఉపాధి పనులపై 18వ సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు ఏపీడీ పక్కీరప్ప తెలిపారు. మంగళవారం స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్, పీఆర్ డిపార్ట్‌మెంట్ సిబ్బందితో సమావేశమయ్యారు. రెండు శాఖల వారు సమన్వయంతో 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులపై సామాజిక తనిఖీ చేపట్టాలని సూచించారు. త్వరలోనే బహిరంగ సామాజిక తనిఖీ ఉంటుందన్నారు. సమావేశంలో ఎస్ఆర్‌పీ ఆవులయ్య, ఏపీఓ, పీర్ డిపార్ట్‌మెంట్ ఏఈ, జేఈలు పాల్గొన్నారు.

మందులు వంకపాలు


మొలగవెల్లి- మద్దికెర గ్రామ సమీపంలోని వంకలో పడేసిన మందులు

ఆలూరు: మండలంలోని మొలగవెల్లి గ్రామం నుంచి మద్దికెర వెళ్లే రహదారి సమీపంలో ఉన్న వంకలో పలు వ్యాధులకు సంబంధించిన మందులు పడి ఉండడాన్ని మంగళవారం రైతులు, ప్రజలు గుర్తించారు. వంకలో మందులు కావాలనే విసిరేశారా లేక పత్తికొండ, పీహెచ్ కేంద్రానికి చెందిన మందులను ఇక్కడికి వచ్చి పడేశారా ? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నారు.

బాలికల హాస్టల్ ఏర్పాటు చేయాలి

దేవనకొండ: మండలకేంద్రమైన దేవనకొండలో ప్రభుత్వ బీసీ బాలికల వసతిగృహాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని, బీసీ బాలుర వసతిగృహాన్ని పునః ప్రారంభించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.శరత్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ నాయకుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కర్నూలు జిల్లాలోని దేవనకొండ మండలం అత్యంత కరువుకాటకాలకు నిలయంగా మారిందన్నారు. ఈ ప్రాంతంలో నిరక్ష్యరాస్యత ఎక్కువగా ఉందన్నారు. ఈ ప్రాంతంలో ఉపాధి లభించక ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారని, దీంతో పిల్లల చదువులు మధ్యలోనే ఆగిపోయిందన్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి మండలకేంద్రంలో బాలికల హాస్టల్‌ను ఏర్పాటు చేసి, బాలుర హాస్టల్‌ను పునః ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మధు, భాస్కర్, సురేంద్ర, అరవింద్, విష్ణు, ఉమేష్, మహేష్, రాము పాల్గొన్నారు.

ఘనంగా మొహర్రం


నంచర్లలో వివిధ వేషధారణలో అలరిస్తున్న చిన్నారులు


ఆస్పరిలో వివిధ రకాల వేషాలలో కళాకారులు


శంకరబండలో పీర్ల ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

చిప్పగిరి: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం వేడుకలు మండలంలో మంగళవారం ఘనంగా జరిగాయి. మండల కేంద్రం చిప్పగిరితో పాటు నంచర్ల, రామదుర్గం, నేమకల్లు, నగరడోణ, బెల్డోణ, కందన గుర్తి, ఏరూరు, డేగుల హాల్ తదితర గ్రామాల్లోని చావిళ్లలో కొలువుదీరిన పీర్ల స్వాములకు భక్తులు చెక్కెర చదివింపులు ఇచ్చి మొక్కు చెల్లించుకున్నారు. యువకలు, చిన్నారులు వివిధ వేషధారణలో అలరించారు.

ఘనంగా పెద్ద పీర్ల సరిగెత్తు

ఆస్పరి: మండలంలోని ఆస్పరి, శంకరబండ గ్రామాల్లో మంగళవారం పెద్ద పీర్ల సరిగెత్తు ఘనంగా నిర్వహించారు. ఆ గ్రామాల్లో పీర్లను మేళతాళాలతో ఊరేగించారు. పీర్లకు అడుగుడుగునా బిందెలతో నీళ్లు పోసి పూజించారు. ఆయాగ్రామాల్లోని అలాయి గుంతల వద్ద యువకులు తప్పెట్లు మోతకు చిందులు వేశారు. వివిధ వేషాధారణలతో కళాకారులు కడుపుబ్బా నవించారు. బుధ వారం పీర్లు ఏటికి పోతారని నిర్వాహకులు తెలిపారు.

ఆకట్టుకున్న వేషధారణలు

ఆలూరు: కుల, మతాలకు అతీతంగా జరుపుకునే మొహర్రం వేడుకలలో భక్తులు సంప్రదాయ పద్ధతులకు అనుగుణంగా పీర్లుకు మొక్కులు చెల్లించుకుంటున్నారు. మనిషి తూకాన్ని బట్టి బెల్లం, చక్కర, నగదు (చిల్లర) చెల్లిస్తున్నారు. అలాగే యువకులు జగ్గి పులి, పక్కీర్‌సాబ్, బోల్ బోల్ సిద్ది, పోటేషాలు, కొందరు ఆడ వేశాలు వేసి అలరించారు. హాలహర్వి మండలం కామినహాళ్ గ్రామంలో కొలువుదీరిన హజరత్ ఇమాం హుసేన్ పీర్లకు మొక్కుబడికి చాలా మంది భక్తులకు మనిబరువును బట్టి చక్కరను చెల్లించారు. అదేవిధంగా మొలగవెల్లిలో జగ్గిపులి, పులి వేషంతో యువకులు గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్తులను అల్లర్తి చేస్తున్న పులిని వలపన్ని పట్టి వేసే సన్నివేశం భక్తులను ఎంత గానో ఆకట్టుకుంటుంది. గ్రామంలో ఆలూరు ఎస్ఐ ఓబులేసు బందోబస్తును పర్యవేక్షణ చేశారు.

తుగ్గలి : మొహర్రం వేడుకల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రం తుగ్గలితోపాటు గ్రామాల్లో భక్తులు పెద్ద సరిగెత్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముస్లింలు పానకం ఊరేగింపుగా తీసుకొచ్చి చావిళ్లలో ప్రత్యేక ప్రార్ధనలు చేసి అగ్నిగుండంలో పోశారు. భక్తులు పీర్లదేవుళ్లకు చెక్కర చదివింపులు చేశారు. మరికొందరు పట్టు వస్త్రాలు, బంగారం, వెండి గొడుగులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత పీర్లను ఊరేగింపు చేశారు. పైచెర్వు తండాలో జెడ్పీటీసీ సభ్యుడు పులికొండనాయక్, మాజీ సభ్యుడు నారాయణనాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మానాయక్, వెంకటేష్‌నాయక్ తదితరులు పీర్లదేవుళ్లను దర్శించుకుని ప్రత్యేక ప్రార్ధనలు చేశారు.

మద్దికెర : మండల కేంద్రం మద్దికెరతోపాటు గ్రామాల్లో మొహరం సందర్భంగా పీర్ల చావిళ్లలో మంగళవారం భక్తులు పెద్ద సరిగెత్తు వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పీర్ల స్వాములకు చెక్కర చదివింపులు చేశారు. విచిత్ర వేషధారణలు ఆకట్టుకున్నాయి.

పీర్ల దేవుళ్లను దర్శించుకున్న ఎమ్మెల్యేలు

హాలహర్వి: మండలంలోని కామినహాల్ గ్రామంలో హజరత్ ఇమాం హుసేన్, హుసేన్ పీర్ల దేవుళ్లను మంగళవారం మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. పీర్లదేవుళ్లకు ప్రత్యేక ఫాతేహాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యేలు మాట్లాడుతూ పీర్లదేవుళ్ల ఆశీస్సులతో అందరికీ మంచి కలగాలని, వర్షాలు సకాలంలో కురిసి రైతులు, పాడిపంటలు బాగుండాలని మొక్కుకున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామిరెడ్డి, సీనియర్ నాయకులు వైకుంఠం మల్లికార్జునచౌదరి, కృష్ణమోహన్, శశికళ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి జనార్దన్‌నాయుడు, నాయకులు మారయ్య, అరికెర వీరేష్, చెన్నప్ప, గోపాల్ తదితరులు ఉన్నారు.


నత్యం చేస్తున్న వేషధారి

మొహర్రం ప్రత్యేకం...పులివేషం


పీర్లచావిడి ఎదుట పులివేషధారి నృత్యాన్ని ఆసక్తిగా తిలకిస్తున్న ప్రజలు


పులివేషధారులు

పత్తికొండ రూరల్ : మొహర్రం వేడుకల్లో భాగంగా భక్తులు ప్రదర్శించే పులివేషం ఆషామాషీ కాదు. సందడి చేసేందుకు వివిధ విచిత్ర వేషధారణలు వేసినప్పటికీ పులి వేశానికి ప్రత్యేకత ఉంది. ఓ విధంగా మొక్కడిలో భాగంగానే భక్తులు పులి వేషం వేస్తారు. గాంభీర్యం ఉట్టిపడాలి. తప్పెట్ల మోతకు అనుగుణంగా హావాభావాలతో వేషధారులు కదం తొక్కాల్సి ఉంటుంది. అప్పుడే చూసేవారిలో ఉల్లాసం, ఉత్సాహం, భక్తిభావం కనిపిస్తుంది. అందుకే పులివేషధారణకు మొహర్రంలో ప్రత్యేక స్థానం ఉంది. పులివేషం ధరించే భక్తులు రాత్రంతా నిద్రమేల్కొని శరీరానికి పెయింటింగ్ వేయించుకుని ఏకాగ్రతతో ఉండాలి. పులివేషం పూర్తయిన తరువాత కుటుంబ సభ్యులు స్నానమాచరించి స్వాములకు చదివింపులు చేస్తారు. తప్పెట్ల వాయిద్యాల మధ్య పులివేషధారులు ఒకరి తరువాత ఒకరు నృత్యం చేస్తూ ఇంటి నుంచి బయటకు వస్తారు. చావిడి చేరుకుని పీర్ల స్వాములకు చెక్కర చదివింపులు చేస్తారు. అనంతరం అగ్నిగుండం ముందు నృత్యం ప్రదర్శన చేయడం ఆనవాయితీ.

మా పూర్వికుల నుంచి పులివేషం



నా వయసు 62సంవత్సరాలు. బేల్దారిపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నా. పనిలేనప్పుడు గ్రామాల వెంట తిరిగి బట్టల వ్యాపారం చేస్తుంటా. మా పూర్వికులతోపాటు తాత నరసింహప్ప, తండ్రి బొల్లం ఈరన్న 20ఏళ్లు దాటిన యువకులు ప్రతి పీర్లపండుగకు పులివేషాలు వేస్తూ మొక్కులు తీర్చుకుంటున్నాం. గత 40ఏళ్ల నుంచి నేను పులివేషం వేస్తున్నా.

–బళ్లారి శ్రీరాములు, పత్తికొండ

కళలు, సంప్రదాయాన్ని ప్రోత్సహించడానికే



కాలానుగుణంగా మారిన టెక్నాలజీకి అనుగుణంగా ఆర్ట్స్ రంగంలో కంప్యూటరీకరణ వచ్చింది. దీంతో పాటు గతంలో చేస్తున్నట్లుగానే పెయింటింగ్ వర్క్ కొనసాగిస్తున్నా. కళలు, సంప్రదాయాలను ప్రోత్సహించేందుకు కొన్నేళ్ల నుంచి లాభాపేక్ష లేకుండా రాత్రి సమయం వెచ్చించి యువకులకు పులి వేషాలు వేస్తున్నా. సమాజంలో కళలకు ఆదరణ తగ్గకుండా చూడాలనేది నా ఉద్దేశం.

– మోహన్, ప్రముఖ ఆర్టిస్టు, పత్తికొండ



పీర్లచావిడిలో ప్రత్యేక ఫాతేహాలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యేలు విరూపాక్షి, బాలనాగిరెడ్డి, పీర్లదేవుళ్లను దర్శించుకున్న భక్తులు



మొలగవెల్లి గ్రామంలో మొహర్రం వేడుకల్లో పులి వేషధారుడు గొల్ల కర్రెన్న, వల వేసి పులిని పట్టుకునే సన్నివేశం

భక్తిశ్రద్ధలతో పెద్ద సరిగెత్తు



హొళగుందలో పీర్లకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు,పీర్లస్వాములను దర్శించుకుంటున్న భక్తులు

హొళగుంద: మండలంలో మొహర్రం వేడుకల్లో భాగంగా మంగళవారం రాత్రి పెద్ద సరిగెత్తును భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో కొలువైన పీర్ల దేవుళ్లకు భక్తులు చెక్కర సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే చావిడీల ముందు అగ్నిగుండ వద్ద తప్పెట్లు కొట్టుకుంటూ మొగలాయి ఆడారు. అనంతరం గ్రామ వీధుల్లో పీర్లు ఊరేగాయి. అదేవిధంగా ఇంగళదహాళ్, ఎండీ హళ్లీ, సుళువాయి, గజ్జహళ్లీ, హెబ్బటం తదితర గ్రామాల్లో పెద్ద సరిగెత్తును ఘనంగా జరుపుకున్నారు. బుధవారం సాయంత్రం దేవుళ్లు ఏటికి (నిమజ్జనం) వెళ్లడంతో ఉత్సవాలు ముగుస్తాయి. హొళగుందలో బాలా మసీదు, చిన్న మసీదు, రాజానగర్ కాలనీ తదితర పీర్ల చావిడీలతో పాటు మండలంలో మొత్తం 21 గ్రామల్లో 30 చావిళ్లలో పీర్లు కొలువుదీరాయి. ఎస్ఐ పెద్దయ్యనాయుడు బందోబస్తు చేపట్టారు.

కృష్ణగిరి: మొహర్రం పీర్ల పండుగ 9వ రోజు పురస్కరించుకుని మంగళవారం కృష్ణగిరి, వెల్దుర్తి మండలాల్లో ఘనంగా పెద్ద సరిగెత్తు నిర్వహించారు. భక్తులు పీర్లస్వాములకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గ్రామాలలో కొలువైన పీర్లు రాత్రి నుంచి సవారి మొదలై పురవీధుల గుండా సాగింది. బుధవారం తెల్లవారుజామున పీర్లుదేవుళ్లు చావిళ్లకు చేరుకుంటాయని, సాయంత్రం జలాధివాసం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

అక్రమ తొలగింపులు ఆపాలి

కృష్ణగిరి: టోల్‌ప్లాజాలో కొన్నేళ్లుగా పని చేస్తున్న వారిని అక్రమంగా తొలగించే విధానానికి స్వస్తి చెప్పాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి టి. శివరాం డిమాండ్ చేశారు. మండల పరిధిలోని అమకతాడు సమీపాన జాతీయ రహదారిపై ఉన్న టోల్‌ప్లాజా వద్ద మంగళవారం యూనియన్ అధ్యక్షుడు అయ్యరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ పదిహేనేళ్లుగా టోల్ ప్లాజాలో పని చేస్తున రాజశేఖర్‌ను టీడీపీ ప్రభుత్వం వచ్చాక నాయకులు టోల్‌ప్లాజా యాజమాన్యంపై ఒత్తిడితెచ్చి తొలగించారన్నారు. గ్రామ రాజకీయాలకు చిరు ఉద్యోగులను బలి చేడయం సరికాదన్నారు. కార్యక్రమంలో టోల్‌ప్లాజా యూనియన్ నాయకులు మధుసూదన్‌గౌడ్, చాణక్యనాయుడు, గోపాలకృష్ణ, వలి, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


టోల్‌ప్లాజా ఉద్యోగులతో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి శివరాం

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని శ్రీ రాఘవేంద్ర కాలనీలో మంగళవారం సాయంత్రం ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో వడ్డే శ్రీను అనే వ్యక్తికి చెందిన గుడిసె దగ్ధమయ్యింది. వడ్డే శ్రీను, భార్య మహేశ్వరి గుడిసెకు తాళం వేసి పనులకు వెళ్లారు. సాయంత్రం ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల వారు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. కొద్ది సేపటికి అక్కడికి చేరుకును అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలు, రూ.5 లక్షల నగదు, దుస్తులు, విలువైన పత్రాలు, శ్రీను కుమారుడు సంతోష్‌కు సంబంధించిన ఎంబీఏ సర్టిఫికెట్లు పూర్తిగా కాలిబూడిద అయ్యాయిని బాధితుడు వాపోయాడు. ప్రమాదంలో దాదాపు రూ. 15లక్షలు పైగా నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడని అగ్నిమాపక ఎస్ఐ రామాంజనేయులు చెప్పారు.


కాలిపోయిన నగదు, విలువైన పత్రాలు

శాకాంబరీగా అంబాభవాని

ఆదోని అర్బన్: పట్టణంలోని కిలిచినపేటలో వెలిసిన శ్రీ అంబాభవానీ దేవస్థానంలో ఆషాఢమాసం సందర్భంగా మంగళవారం ఉదయం శాకాంబరీ అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు దుర్గామారుతి ఆధ్వర్యంలో అమ్మవారికి 21 రకాల కాయగూరలతో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. జల, పుష్ప, పంచామృతాభిషేకం, కుంకుమార్చన చేపట్టారు. అలాగే ఈశ్వరుడికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అలాగే ఎస్‌కేడీ కాలనీలో వెలిసిన శ్రీ తాయమ్మ ఆలయంలో ఆషాఢ మాసం సందర్భంగా మంగళవారం అమ్మవారు శాకంబరీ మాత అలంకారంలో దర్శనమిచ్చారు. పట్టణ వరల్డ్ ఆర్యవైశ్య మహాసభ (వామ్) మహిళా విభాగ్ ఆధ్వర్యంలో అమ్మవారికి అలంకారం చేసి లలితా సహస్త్రనామం, దేవీ ఖడ్గమాల స్తోత్రం పారాయణం చేసి, తీర్థ ప్రసా దం అందించారు.


శాకాంబరీ అలంకారంలో అంబాభవానీ మాత

ప్రతి కౌలు రైతుకు గుర్తింపు కార్డు అందిస్తాం

దేవనకొండ: అర్హత ఉన్న ప్రతి కౌలు రైతుకు గుర్తింపు కార్డు అందిస్తామని జిల్లా వ్యవసాయాధికారిణి వరలక్ష్మి తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన దేవనకొండలో కౌలు గుర్తింపు కార్డులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి కౌలు రైతు భూ యజమానితో ధ్రువీకరణ పత్రం తీసుకొని దరఖాస్తు చేసుకోవాలన్నారు. మండలంలో దాదాపు 1,270 సీసీఆర్‌సీ (కౌలుగుర్తింపు కార్డులు) లక్ష్యంగా ఇవ్వడం జరిగిందన్నారు. కౌలు రైతులకు కౌలు కార్డు ఇవ్వడం వల్ల భూ యజమానికి ఎలాంటి నష్టం ఉండదన్నారు. తన భూమిపై హక్కు కోల్పోతారన్నది అపోహ మాత్రమేనన్నారు. కౌలు పత్రం కేవలం 11 నెలలకు మాత్రమే వర్తిస్తుందని చెప్పారు. అనంతరం మండలంలోని తెర్నెకల్ గ్రామ పరిధిలో సాగుచేసిన వేరుశనగ, పత్తి తదితర పంట పొలాలను పరిశీలించారు. పురుగులు, తెగుళ్ల ఆశించకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టి, ఏఓ సురేష్‌బాబు, ఏఈవోలు రంగన్న, యోగేంద్ర ఉన్నారు.


కౌలు రైతులకు గుర్తింపుకార్డులను అందిస్తున్న జిల్లా వ్యవసాయాధికారిణి వరలక్ష్మి

పంటసాగు హక్కు పత్రాలపై అవగాహన

తుగ్గలి : మండలంలోని కడమకుంట్ల, పగిడిరాయి, చెన్నంపల్లి తదితర గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ, వ్యవసాయశాఖ సిబ్బంది పంటసాగు హక్కు పత్రాలపై రైతులకు అవగాహన కల్పించారు. పగిడిరాయి, కడమకుంట్ల సదస్సుల్లో పాల్గొన్న తహసీల్దార్ షర్మిల మాట్లాడుతూ కౌలు రైతులకు కేవలం సాగు చేసిన పంటపై మాత్రమే హక్కు ఉంటుందని, భూమిపై వారికి ఎటువంటి అధికారం ఉండదన్నారు. కౌలు కార్డు పరిమితి కేవలం పంట దిగుబడులు తీసుకునే వరకు మాత్రమే ఉంటుందన్నారు. కౌలు కార్డుతో ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు, ప్రయోజనాలను ఆమె వివరించారు. సదస్సుల్లో ఆర్ఐ సుధాకరరెడ్డి, వీఆర్వోలు కృష్ణారెడ్డి, రంగన్న, రంగప్ప, ఎంఈవోలు మహేష్, నాగార్జున పాల్గొన్నారు.

కౌలు రైతు కార్డులను సద్వినియోగం చేసుకోవాలి

చిప్పగిరి: కౌలు కార్డులను కౌలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ విజయలక్ష్మి సూచించారు. మంగళవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో వారు మాట్లాడుతూ గ్రామాల్లో కౌలుకు పొలం చేస్తున్న రైతులు ఆర్బీకేకు వెళ్లి కౌలు రైతు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కౌలు కార్డుపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు న్విహిస్తున్నట్లు తెలిపారు. కౌలు కార్డు ఉంటే ప్రభుత్వం అందించే వివిధ పథకాలు పొందవచ్చన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

ఆలూరు: సన్న, చిన్న కారు రైతుల సమస్యలను పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలను టీడీపీ ప్రభుత్వం నెరవేర్చాలని సీపీఐ మండల కార్యదర్శి రామాంజనేయులు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో మంగళవారం సీనియర్ నాయకులు గోపాల్ ఆధ్వర్యంలో ఏపీ రైతు సంఘం నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. టీడీపీ ప్రభుత్వం ప్రజలు, రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈనెల 21న ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు, వివిధ సంఘాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ నాయకులు తరలి రావాలని పిలుపునిచ్చారు. తిక్కన్న, వదరరాజులు శేఖర్, గోపాల్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

సీసీఆర్ కార్డులతో ప్రయోజనాలు

కృష్ణగిరి: సీసీఆర్(పంట సాగు హక్కు ధ్రువీకరణ) పత్రాలతో కౌలు రైతులకు బహుళ ప్రయోజనాలున్నాయని ఏఓ వెంకటేశ్వర్లు తెలిపారు. మండల పరిధిలోని టి.గోకులపాడు, తొగర్చేడు గ్రామాల్లో సీసీఆర్ కార్డులపై కౌలు రైతులకు మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ సీసీఆర్ కార్డుల వల్ల కౌలు రైతులు రాయితీ విత్తనాలతోపాటు బ్యాంక్‌ల ద్వారా పంట రుణాలు పొందవచ్చని తెలిపారు.

అను మంత్రాలయం మఠంలో చోరీ

మంత్రాలయం: అను మంత్రాలయంగా పేరుగాంచిన తుంగభద్ర రాఘవేంద్రస్వామి మఠంలో సోమవారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. మఠంలోని హుండీ తాళాలను పగులగొట్టి నగదును ఎత్తుకెళ్లినట్లు మాధవరం ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. ఈ ఏడాది మార్చి నెల నుంచి ఇప్పటి వరకు హుండీని లెక్కించలేదని, హుండీలో దాదాపు రూ.30 వేల వరకు నగదు ఉన్నట్లు భావిస్తున్నామని వివరించారు. మఠం అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

గ్రావెల్‌తో గుంతల పూడ్చివేత

హొళగుంద: మొహర్రం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రధాన రోడ్లు, వీధుల్లో పీర్ల ఊరేగింపుకు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో గ్రామ సర్పంచ్ చలవాది రంగమ్మ, పంచాయతీ సెక్రటరి రాజశేఖర్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు పంపాపతి గ్రావెల్ వేయించి చదును చేయించారు. ఈ ప్రాంతంలో గుంతలు ఏర్పడి ప్రజలు తిరిగెందుకు ఇబ్బందిగా ఉండేది. వర్షాకాలం కావడంతో సమస్యను తెలుసుకున్న సర్పంచ్ మంగళవారం ట్రాక్టర్లు పెట్టి రోడ్డుపై గుంతలను గ్రావెల్‌తో పూడ్చి చదును చేయించారు. అలాగే పీర్ల చావిడీలు, వీధుల్లో చెత్త చెదారాన్ని తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.


ప్రధాన రోడ్డుపై గ్రావెల్ వేసి చదును చేస్తున్న దృశ్యం

ఏఐకేఎంఎస్ జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయండి

ఎమ్మిగనూరు టౌన్: ఈనెల 20న రాజమండ్రిలో జరిగే అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సత్యన్న పిలుపునిచ్చారు. మంగళవారం ఎమ్మిగనూరు పట్టణంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర కౌన్సిల్ కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ కూటమి మోదీ ప్రభుత్వం సామ్రాజ్యవాదులకు, బహుళ కంపెనీలకు మరింత ఊడిగం చేస్తుందన్నారు. వ్యవసాయ రంగంతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వ నాశనం చేస్తోందని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ ప్రజా వ్యతిరేక విధానాలను సమరశీల పోరాటలతో ప్రజలు తిప్పి కొట్టాలన్నారు. రాష్ట్ర కౌన్సిల్‌లో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రామలింగయ్య, రంగన్న, ఈరన్న, రామకృష్ణ, నాగేంద్ర, జన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం రవాణాపై ఉక్కుపాదం


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివనారాయణస్వామి

ఆదోని అర్బన్: కర్ణాటక మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని డీఎస్పీ శివనారాయణ స్వామి అన్నారు. మంగళవారం ఆదోని పట్టణంలోని వాల్మీకినగర్, బోయగేరికి చెందిన ఇద్దరు కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడినట్లు డీఎస్పీ తెలిపారు. పట్టుబడిన మద్యం, ముద్దాయిల వివరాలను విలేకరులకు వెల్లడించారు. వాల్మీకినగర్‌కు చెందిన బోయ నాగరాజు, బోయగేరికి చెందిన బోయ శివలు కర్ణాటక రాష్ట్రంలోని నాగరహాల్ నుంచి వైన్‌షాపులో 9 లిక్కర్‌బాక్సులను కొనుగోలు చేసి స్కూటీ(ఏపీ21సీసీ8460)పై తరలిస్తుండగా పట్టణ శివారులోని ఇస్వీకి వెళ్లే రహదారిలోని బాలకొలను వద్ద పట్టుకున్నామన్నారు. నిందితులను అరెస్టు చేసి స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడుల్లో వన్‌టౌన్ సీఐ తేజమూర్తి, ఎస్ఐ మధుసూదన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.